మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అపర్ణపాటిల్

- 19 మంది కౌన్సిలర్ల మద్దతుతో ఏకగ్రీవం
- మళ్లీ బీఆర్ఎస్‌కే దక్కిన మున్సిపల్ పీఠం

అపర్ణపాటిల్‌కు చైర్‌పర్సన్ ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి వసంతకుమారి

సదాశివపేట, మార్చి 4: సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణశివరాజ్ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి వసంతకుమారి అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సమావేశం నిర్వహించారు. 26 మంది కౌన్సిలర్లు ఉండగా19 మంది సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఇందులో 15మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ ఒకరు, ఇద్దరు ఎంఐఎం కౌన్సిలర్లు, స్వతంత్ర కౌన్సిలర్ ఒకరు ఉన్నారు.1/2 వంతు కోరం ఉండడంతో మున్సిపల్ నిబంధనల ప్రకారం చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారి వసంతకుమారి చైర్‌పర్సన్‌ను ప్రతిపాదించాలని కోరారు. దీంతో 23వ వార్డు కౌన్సిలర్ ఇంద్రమోహన్ గౌడ్ 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణపాటిల్‌ను చైర్‌పర్సన్‌గా ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ ఆకుల శివకుమార్ బలపర్చారు.

మిగతా కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ఎన్నికకు మద్దతు తెలిపారు. దీంతో చైర్‌పర్సన్‌గా అపర్ణ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి వసంతకుమారి ప్రకటించారు. అనంతరం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అపర్ణ పాటిల్ ప్రమాణస్వీకారం చేశా రు. మున్సిపల్ పీఠం మళ్లీ బీఆర్ఎస్‌కే దక్కడంతో కార్యాలయం ఎదుట నాయకులు పటాకులు పేల్చి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంబురాలు చేసుకున్నారు. అనంతరం అపర్ణ శివరాజ్‌పాటిల్ మాట్లాడుతూ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సదాశివపేట బల్దియాను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, మున్సిపల్ కమిషనర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

పదిమంది విద్యార్థులు డిబార్

న్యాల్‌కల్, మార్చి 4: న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలో పదిమంది విద్యార్థులు డిబారయ్యారు. స్థానిక కళాశాలలో సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపులకు సంబంధించిన పరీక్షలు రాస్తూ ప్రత్యేక తనిఖీ బృందాలకు పట్టుబడ్డారు. దీంతో ఆయా గ్రూపులకు చెందిన పది మంది విద్యార్థులను సంబంధిత అధికారులు డిబార్ చేశారు.

బాలికలు చదువుకోవాలి

కోహీర్, మార్చి 4: బాలికలందరూ కష్టపడి చదువుకోవాలని జహీరాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు సంగ్రామ్‌పాటిల్ అన్నారు. సోమవారం మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశం, ఎంపీటీసీ రత్నయ్య, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, మొల్లయ్య, సుభాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

శివాలయానికి స్థలం కేటాయించాలి

జిన్నారం, మార్చి4: జిన్నారంలోని తాబేలు గుట్టపై నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదెకరాలు కేటాయించాలని జిన్నారం గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రం కావడానికి, జిన్నారంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు సహకరించాలన్నారు. దివంగత నర్సాపూర్ మాజీఎమ్మెల్యే చిలుముల విఠల్‌రెడ్డి, జిన్నారం మండల మొదటి ఎంపీపీ పడకంటి వెంకటేశంగుప్తా విగ్రహాలను తహసీల్దార్ కార్యాలయం ప్రహరీ ఎదుట ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేందుకు కలెక్టర్‌ను అనుమతి కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిన్నారం గ్రామస్తులు భోజిరెడ్డి, సింహారెడ్డి, రాజిరెడ్డి, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అధికారుల విచారణ

జిన్నారం, మార్చి 4: మాదారం పంచాయతీ పరిధిలోని కంకర క్వారీల్లో సెంట్రల్ మైన్స్, సేఫ్టీ అధికారులు సోమవారం విచారణ జరిపారు. ఫిబ్రవరి 9న క్వారీలపై మాదారం యువకులు సెంట్రల్ మైన్స్, సేఫ్టీ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈమేరకు సెంట్రల్ మైన్స్, సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, రవీంద్రనాథ్ క్వారీల్లో విచారణ జరిపారు. గ్రామానికి ఎంత దూరంలో క్వారీ ఉండాలి, క్వారీలో ఎంత లోతులో తవ్వకాలు జరపాలి, ఎంత డెప్త్‌లో పేలుడు జరుపాలో విచారణ జరిపారు. డస్ట్ వెదజల్లుతున్న ప్రాంతం, రోడ్డుపై నీళ్లు జల్లుతున్నారా లేదా విచారించారు. క్వారీలో పేలుడు, తవ్వకాలు తదితర వాటికి సంబంధించి ఏమేమి అనుమతి పత్రాలు ఉన్నాయో తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

రామచంద్రాపురం, మార్చి 4: కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సోమవారం బండ్లగూడలోని పెన్నార్ పరిశ్రమ కార్మిక సంఘం ఎన్నికల గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ బుధవారం జరుగనున్న కార్మికసంఘం ఎన్నికల్లో సీఐటీయూకి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. సీఐటీయూను కార్మికులు గెలిపిస్తే చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాన్ని సాధించి తీరుతామన్నారు. కార్మికులకు ఉద్యోగభద్రత కల్పిస్తామన్నారు. ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూను బలపర్చడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీటీసీ శ్రీశైలం, మాజీ సర్పంచ్ జయమ్మ, సీఐటీయూ నాయకులు మల్లేశం, రాజయ్య, శేషగిరి, త్రిమూర్తులు, శివపాల్, రెహమాన్, వీఎస్‌రాజు, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మునిపల్లి, మార్చి 4: తహసీల్ కార్యాలయంలో రెండు రోజు ల నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్టు ఆదివారం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం నుంచి మునిపల్లి తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకునేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రియల్ వ్యాపారులు, రైతులు నమస్తే తెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినుల క్షేత్రస్థాయి పరిశీలన

జహీరాబాద్, మార్చి 4 : హైదరాబాద్ రాజేంద్రనగర్ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థినులు సోమవారం జహీరా బాద్ ప్రాంతంలో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిన్న హైదరాబాద్, రంజోల్ గ్రామాల్లో నాలుగో సంవత్సరం బీఎస్సీ చదువుతున్న విద్యార్థినులు శిక్షణలో భాగంగా రెండు నెలలు చిన్న హైదరాబాద్‌లో ఉంటూ సాగు పద్ధతులు, కలుపు, రసాయన మందుల వినియోగం, పంటలు కోయడం వంటి విషయాలను తెలుసుకోనున్నారు. గ్రామాల్లో రైతుల స్థితిగతులు, రూపురేఖలు ముగ్గుల రూపంలో చిత్రపటాలు రూపొందిస్తున్నారు. ఉద్యాన కళాశాల విద్యార్థినులకు జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్ మార్గనిర్దేశం చేస్తున్నారు.

జహీరాబాద్ మండలంలోని చిన్నహైదరాబాద్ గ్రామస్తులతో ఉద్యాన కళాశాల విద్యార్థినులు

మహాశివరాత్రికి మాజీమంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

సంగారెడ్డి, మార్చి 4 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీమంత్రి హరీశ్‌రావుకు జ్యోతిర్వాసు విద్యాపీఠం ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆహ్వాన పత్రిక అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మాజీమంత్రి నివాసానికి డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యంతో కలిసి వెళ్లిన సిద్ధాంతి జ్యోతిర్వాసు విద్యాపీఠంలో జరిగే భస్మ లింగం అభిషేక కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కూడా వేడుకల్లో పాల్గొనాలని కోరారు. మహాశివ రాత్రి సందర్భంగా భస్మ లింగం అభిషేకంతో స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సిద్ధాంతి తెలిపారు.


మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలను ఆహ్వానిస్తున్న సిద్ధాంతి

దరఖాస్తుల స్వీకరణ

గుమ్మడిదల, మార్చి 4: భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి, దోమడుగు గ్రామాల్లో తహసీల్దార్ గంగాభవాని, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించా రు. గతంలో ధరణి పోర్టల్‌లో సాంకేతికంగా వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి రెవె న్యూ యంత్రాంగం కృషి చేస్తుందని తహసీల్దార్ తెలిపారు. మండలవ్యాప్తంగా ఈనెల 9వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జహీరాబాద్, మార్చి 4: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, పాటలు, స్కిప్పింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో దాగిఉన్న నైపుణ్యతను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు.

గెలుపొందిన వారికి ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్వేత, లలిత, మీన, లక్ష్మి, సుమలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణంలోని శ్రామిక్ విజ్ఞానకేంద్రంలో ముగ్గులను పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

జాతీయ భద్రత వారోత్సవాలు ప్రారంభం

జిన్నారం, మార్చి 4 : జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామిక వాడల్లో 53వ జాతీయ భద్రత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి 10వ తేదీ వరకు వారోత్సవాలు జరగనున్నాయి.

గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–2లో జాతీయ భద్రత వారోత్సవాలను జీఎం శ్రీధర్‌సూరత్ ప్రారంభించారు.

హెచ్ఆర్ మేనేజర్లు శంకర్‌ప్రసాద్, మూర్తి, సేఫ్టీ మేనేజర్ థాపాస్, కార్మికులతో కలిసి భద్రత వారోత్సవాల సందర్భంగా పరిశ్రమ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. విధులు నిర్వహించేటప్పుడు షూస్, గ్లౌజ్‌లు, హెల్మెట్, యాప్రాన్ ఇతర సేఫ్టీ వస్తువులను వినియోగించి జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులు, కార్మికులకు సూచించారు.

గడ్డపోతారం ఎపిటోరియా ఫార్మా పరిశ్రమలో ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

డివిజన్ అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం, మార్చి 4: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. సోమవారం ఆర్సీపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో రూ. 30లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని 4,7వ బ్లాక్ మధ్యలో సీసీ రోడ్డు సమస్య పరిష్కారమయిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రతినిత్యం దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కాలనీల్లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ లైన్లను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలు ఉంటే ప్రజలకు తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అలీబాబా, హబీబ్, అబ్దుల్‌గఫర్, జలాల్, బాబా, అహ్మద్, మల్లేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

సదాశివపేట, మార్చి 4: సదాశివపేట నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరింది. సోమవారం మార్కెట్ ఆవరణలో నూతన మార్కెట్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మార్కెట్ కమిటీ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఛాయాదేవి హాజరై చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా సడాకుల కుమార్, వైస్‌చైర్మన్‌గా కంది కృష్ణ, డైరెక్టర్లుగా బేగరి చిరంజీవి, విశ్వనాథ్‌కళావతి, నరేందర్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, చౌహాన్ సోమ్లా, పట్లోళ్ల శివకుమార్, సయ్యద్ యూసుఫ్, మధూకర్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డి, శేఖర్, కొత్త లక్ష్మణ్‌కుమార్, కొమ్ము రమేశ్ ఉన్నారు. డీసీసీ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి హాజరై ప్రసంగించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గడీల రాం రెడ్డి, కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, సిద్దన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 4: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పోతన్‌పల్లి (ఆర్)లో నిర్వహించిన శివాలయ ప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోతన్‌పల్లిలో శివాలయం అభివృద్ధికి రూ. 10లక్షలు కేటాయించడంతో పాటు రూ. 1.50లక్షల జడ్పీనిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పరమేశ్, నాయకులు సాయిరెడ్డి, భూంరెడ్డి, కృష్ణ, నర్సింహులు, తుకారాం, శంకర్ పాల్గొన్నారు.

7న బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్లు మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణ సమీపంలోని జుజాల్‌పూర్ శివారులోని హెచ్ఆర్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలను నిర్వహించనున్న సమావేశానికి మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

అందోల్, మార్చి 4: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్ బుధవారం తెలిపారు. మండలంలోని రాంసన్‌పల్లి గ్రామానికి చెందిన భీమయ్య, ఎర్రారం గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి ద్విచక్ర వాహనాలు అన్నాసాగర్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న పోలీసులు వారిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సిగ్నేచర్ క్యాంపెనింగ్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 4: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో సిగ్నేచర్ క్యాంపెనింగ్‌తోపాటు మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా, సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మండల, జిల్లాస్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వసంత కుమారి, జ్యోతి పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు నీలం మధు విరాళం

జిన్నారం, మార్చి 4 : ఊట్ల గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే మల్లన్న జాతరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు విరాళం ప్రకటించారు. సోమవారం యాదవసంఘం సభ్యులు నీలం మధును తన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి జాతరకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. జాతరకు తప్పకుండా హాజరవుతానని యాదవ సంఘం సభ్యులకు నీలం మధు తెలిపారు. అనంతరం ఉత్సవాలకు రూ.50వేలు ప్రకటించారు. నీలం మధును కలిసిన వారిలో శ్రీశైలంయాదవ్, మల్లేశ్‌యాదవ్, పర్వతాలు యాదవ్, సత్యనారాయణయాదవ్, లక్ష్మణ్ యాదవ్, మహేందర్‌యాదవ్, నర్సింహులు యాదవ్, నాయకులు రఘు, వీసాయికుమార్, భిక్షపతి, మహేశ్ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం

భద్రతాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రతన్ కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 4: 50 ఏండ్లలో జంతుజాతుల అభివృద్ధి సగటున మూడింట రెండువంతుల మేర తగ్గిందని ఎకో క్లబ్ కన్వీనర్ సుగుణావతి అన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని సోమవారం పట్టణంలోని తారా కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ సుగుణావతి మాట్లాడారు. అనంచరం భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించారు. నిత్య జీవితంలో భద్రతకు అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రతన్‌కుమార్, అధ్యాపకులు అన్నపూర్ణ, శ్రావణి, శివదీప్తి, ఏవీ శర్మ, అభిజిత్, జలీల్, సత్యప్రకాశ్, నాగరాజ్, సంతోష్‌కుమార్, రాజేందర్, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సిలిండర్లు డెలివరీ చేయాలి

బొల్లారం, మార్చి 4: బుక్ చేసిన సిలిండర్లు ఇంటి వద్దకే డెలివరీ చేయాలంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోదారులు క్యూకట్టి సిలిండర్లు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన సిలిండర్‌పై అదనంగా రూ. 50వసూలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు చొరవ తీసుకొని ఇంటి వద్దకే గ్యాస్ డెలివరీ చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఏజెన్సీ ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

పోలియోచుక్కలు వేయించాలి

న్యాల్‌కల్, మార్చి 4: చిన్నారులకు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని మిర్జాపూర్(బి), న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు నృపేన్‌చక్రవర్తి, గణపతిరావు సూచించారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా రెండోరోజు సోమవారం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వలంటీర్లు ఇంటింటికెళ్లి చిన్నారులకు చుక్కలమందు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్, మార్థ, గోపికృష్ణ, నాగరాణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 4: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎండీ జావేద్ అలీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రతి సంవత్సరం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొని ఆటపాటలతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, జీవోఎమ్ ఇందిరాదేవి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎండీ జావేద్ అలీ, కార్యదర్శి రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకటరెడ్డి, సంఘం నాయకులు, సభ్యులు శ్రీనివాస్, మమత, రాజకుమారి, సుధామణి, విజయ్‌కుమార్, యాదవరెడ్డి, వెంకటేశం, భాస్కర్, షకీల్, ఆంజనేయులు, శ్రీనివాస్, సుధారాణి, ప్రమోదషరీఫ్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడల్లో పాల్గొన్న మహిళాఉద్యోగులు

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

రామచంద్రాపురం, మార్చి 4: ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దడంతోపాటు వారిని క్రమశిక్షణలో నడిపించే గొప్ప బాధ్యతని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి అన్నారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా రమాదేవి తొమ్మిదేండ్లు విధులు నిర్వహించి బదిలీపై హత్నూరకు వెళ్తున్న సందర్భంగా మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, ఉపాధ్యాయులు ఘనం గా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తెల్లాపూర్ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యాల కల్పనలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఎల్లవేళలా సహకారం అందించారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకొ ని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూ చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం, నాగరాజు, నాయకులు దేవేందర్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, ఉమేశ్, సాగ ర్, సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
రీజినల్ కార్యాలయం, సంగారెడ్డి

అద్దె / లీజు కొరకు బ్రాంచ్ ప్రాంగణం కావలెను

శాఖ పేరు	సంప్రదించవలసిన నెంబరు
నారాయణఖేడ్–8157	9490153748
సంగారెడ్డి–8101	9493126205

పైన తెలుపబడిన ఏరియా, 1800 నుండి 2200 చ॥అ॥ల కనీసం విస్తీర్ణం, గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యం, పార్కింగ్ సౌకర్యం గల ఆవరణ లీజుకు కావలెను. నిర్మాణంలో ఉన్నవి కూడా పరిశీలించబడును. ఆసక్తి గల పార్టీలు సంబంధిత అన్ని డాక్యుమెంట్లతో ప్రాంతీయ కార్యాలయం / బ్రాంచ్‌ను తేది. 11.03.2024 న లేదా అంతకుముందుగా గాని సంప్రదించగలరు. సం/- రీజినల్ మేనేజర్, సంగారెడ్డి ఫోన్ నెం. 9490153762

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

కంది, మార్చి 4: అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు రాష్ట్రానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి కోరారు. జిల్లాలో ప్రధాని పర్యటన సందర్భంగా సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం శరవేగంగా అభివృద్ధి చెందు తూ ప్రపంచంలోనే 5వ ఆర్థిక శక్తిగా ఎదిగినప్పటికీ, దేశ జనాభాలో 50శాతం ఉన్న రైతులు, రైతు కూలీల పరిస్థితి దయనీయస్థితిలో ఉన్నదన్నారు. రైతుసాగుకు పెట్టిన పెట్టుబడికి మూడురెట్లు ఉండేలా ఎంఎస్‌పీ నిర్ణయించాలని, ప్రైవేట్ అప్పులు, అధిక వడ్డీ భారం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నారు. ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.5లక్షల వరకు ప్రత్యేక రుణాలు ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశా రు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి

ప్రధాని సభను విజయవంతం చేయాలి

కంది, మార్చి 4: ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమానందం పిలుపునిచ్చారు. మంగళవారం పటాన్‌చెరు నియోజకవర్గం పటేల్‌గూడలో ప్రధాని బహిరంగ సభ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమానందం మాట్లాడుతూ మోదీ సభకు భారీ ఏర్పాట్లు చేశామని, ఉదయం 11.30గంటలకు బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారని తెలిపారు. ప్రధాని సంగారెడ్డి జిల్లాకు రావడం శుభ పరిణామమన్నారు. రాష్ట్రంలో అధిక పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు సభకు భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, గురువారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వాసు, నాగరాజు, డాక్టర్ రాజుగౌడ్ పాల్గొన్నారు.